# భగవంతుని చుట్టూ....

- *ఆంధ్రప్రభ*, **26-10-77**

---

**"భగవంతునిమీద లేనిపోని కథలల్లి... భక్తిని పోగొట్టి, భయాన్ని మిగల్చడం.... కవి భక్తులు చేసిన పెద్ద తప్పిదనం."**

---

మంచులో తడిసిన గాలి, అడవిపూల మత్తువాసన, ఎత్తయిన పర్వతాలు, క్రిందికి చూస్తే అందమైన లోయలు, చుట్టూ అరణ్యం, క్రింది పట్టణంలో అతి చిన్నగా కనిపించే యూనివర్శిటీ బిల్డింగ్స్, 'గోవిందా' శబ్దంతో మారుమ్రోగే కొండ ప్రాంతం, కళ్ళ ముందు కదలిపోయే మేఘాలు ఎన్నిసార్లు చూచినా, నిత్యనూతనంగా వుండే తిరుమల, సప్త గిరులచుట్టూ మెలికలు తిరుగుతూ వెళుతున్న కారులోంచి ఆసక్తిగా తొంగి చూస్తోంది ద్వారకి.

తన జీవితంలో పాతిక సంవత్సరాలు గడచినా, తిరుపతికి అతిదగ్గరలో ఉన్నా కూడా ఆమెకు ఇదే తిరుమలకు తొలి ప్రయాణం. రాజమండ్రినుండి తన సహపాఠీ, స్నేహితురాలూ అయిన శారద, తన కుటుంబంతో తిరుపతి వెళుతూ అయిదేళ్ళ తరవాత ద్వారకిని చూడాలనే ఆశతో నెల్లూరులో దిగింది. అయిదేళ్ళుగా కాలేజీలో పాఠాలు వల్లిస్తూ విసిగిపోయి, కాస్త రిలీఫ్ కొరకు ఎదురుచూస్తున్న సమయంలో స్నేహితురాలు రావడంతో చాలా హాయి అనిపించింది ద్వారకకి. శారదతోపాటు వచ్చిన వాళ్ళ అన్న, తమ్ముడు, అమ్మ, అమ్మమ్మ, నాన్నగారు ద్వారకకి పరిచితులే. వాళ్ళందరితో ఒకటి, రెండు రోజులు గడపాలని నిర్ణయించుకున్న ద్వారకి వాళ్ళతో బయలుదేరింది.

"అయితే అమ్మాయ్, నెల్లూరులో ఉండి ఇంతవరకు నువ్వు వెంకటరమణుణ్ణి దర్శించుకోనే లేదా?"

కొన్ని ఏళ్ళుగా శారద అమ్మమ్మ వర్ధనమ్మలో మరోమారు ఏడుకొండల శ్రీనివాసుని దర్శించాలనే కోరిక మహాబలంగా వుంది. ఈనాటికి విదేశాలనుండి తిరిగి వచ్చిన మనుమడి పుణ్యమా అని ఆ ఆపద మొక్కులవాడిని చూడగలుగుతున్నందుకు... దాని మూలంగా స్వర్గంలో తనకింత జాగా దొరకబోతున్నందుకు ఆ వృద్ధురాలికి చాలా సంబరంగా ఉంది. ఇంతటి మహత్తరమైన దేవుడి పాదాలముందున్న ఈ పిల్ల ఆయనను చూడడానికీ, ఇంత పుణ్యజలం నెత్తిన చల్లుకోవడానికీ రాలేదంటే... ఆమెకు అమిత ఆశ్చర్యంగా ఉంది.

"లేదు, అమ్మమ్మా, అదేమి జాతకమో మొక్కుకుందామంటే ఇంతవరకు ఒక్క ఉపద్రవమైనా రాలేదు" నవ్వుగా నవ్వింది ద్వారకి.

"అవేమి అపభ్రంశపు మాటలూ! చెంపలేసుకో అమ్మాయ్" అమ్మమ్మ గాభరాకి మనసులో నవ్వువచ్చినా, పైకి బుద్ధిగా చెంపలేసుకుంది ద్వారకి.

ఏడు పర్వత శిఖరాలను చుట్టుకుంటూ వచ్చి ఆఖరి శిఖరపు అంచుమీద ఒక్క క్షణం ఆగింది కారు. ఎదురుగా వున్న దృశ్యం చూస్తూనే సర్వం మరిచిపోయింది ద్వారకి. రంగురంగుల బొమ్మరిల్లులా అక్కడక్కడా కాలనీలు, ఒక ప్రక్క పెద్ద సత్రం. నిర్మాణంలో మరో సత్రం. గుంపులు గుంపులుగా రకరకాల వాహనాల్లో దిగుతున్న జనం. తండోపతండాలుగా 'గోవిందా' నాదాలతో కాలిబాటన వచ్చే ప్రజానీకం. ఇంత మంది ప్రజలలో ఇంత విశ్వాసాన్ని, ఇంతటి భక్తిభావాన్ని నింపుతున్న, ఈ వెంకటేశ్వరుని మహిమ,..... మరే దేవతా విగ్రహానికీ లేని వైభోగాన్ని స్వంతం చేసుకున్న ఈ శ్రీహరి అదృష్టం ఎంత విశిష్టమైనది!

కారు దిగుతూనే తను ఊహించని స్వాగతానికి విస్తుపోయింది ద్వారకి. తను విన్నంతవరకు తిరుమలలో అష్టకష్టాలు పడాలనీ.... నిలువ నీడ, తాగునీరూ ఉండవనీ... ఎన్ని గంటలు క్యూలో నిలబడ్డా ఆ రోజుకి దర్శనమవుతుందనే నమ్మకం లేదనీ.... ఇంకా చాలా చాలా.....

శారద నాన్న నిరంజనరావుగారి స్నేహితుడు ఒకాయన తిరుమల దేవస్థానం ట్రస్టీ మెంబరుగా వున్నారు. ఆయన పుణ్యమా అని మంచి కాటేజ, హీటర్ నుండి కావాల్సినన్ని వేన్నీళ్ళు లభించాయి. కానీ తనకింతవరకు అనుభవంలేని కష్టాలలోని థ్రిల్‌ను అనుభవించాలనుకున్న ద్వారకికి అది నిరాశే అయింది. వీధి కుళాయిలో కాళ్ళు, చేతులు కడుక్కోవడం.... తెచ్చుకున్న పులిహోర, ఫలహారాలు చెట్టుక్రింద కూర్చుని తినడం.... తరువాత క్యూలో నిలబడి నిమిషనిమిషానికి జరుగుతూ కబుర్లు చెప్పుకోవడం... రకరకాల మనుషులు చెప్పుకునే ఊకదంపు కబుర్లు వినడం, చుట్టూ వున్న

కోతులను ఊరిస్తూ కొబ్బరికాయలు తినడం.... ఇంకా చాలా చాలా స్వేచ్ఛగా ఊహిస్తున్న ద్వారకి కొన్ని ఫర్లాంగుల దూరమున్న క్యూని దాటేసి తమని గుడిలోకి తోసేసరికి పూర్తిగా నిరాశ పడిపోయింది.

గణగణమని గంట మోగింది.

"ఏమిటది?" కుతూహలంగా అడిగింది ద్వారకి.

"మనలాంటి వి.ఐ.పి.లు, మంత్రులు, సినిమా నటులు వచ్చినప్పుడు అక్కడ క్యూని ఆపేసి, మనల్ని పంపడానికి చిన్న సిగ్నల్ అది" చెబుతున్న విజయ్ వైపుకు తటాలున తిరిగింది ద్వారకి. ఆమె కళ్ళలో కనపడిన భావం అతనికి బోధపడలేదు. గర్భగుడిలో ప్రవేశించబోతున్నప్పుడు మరో జట్టువచ్చి తన ముందుగా కలవడం చూసి అడిగింది ద్వారకి.

"వీళ్ళెలా వచ్చారు?"

ఆమె ఆశ్చర్యానికి సన్నగా నవ్వాడు విజయ్.

"ఇది మరో పెద్ద రికమెండేషనో లేకపోతే ఏ దఫేదారు చేతిలోనో పడిన పెద్ద నోటు ఫలితమో అయ్యుంటుంది."

'అయితే దేవుడికి కూడా దొంగదారులు చాలా వున్నాయన్నమాట.... కైలాసానికి డైరెక్ట్ రూటన్న మాట ఇది.'

నోటిదాకా వచ్చిన మాటలు నోటిలోనే దాచేసింది ద్వారకి. తనకు తెలుసు, వీళ్ళంతా పరమభక్తులు. గర్భగుడి వాకిట నిలుచుని అలాటి మాటలంటే వాళ్ళు సహించలేరు. ఆరు సంవత్సరాలు విదేశాలలో వుండి, ఇప్పుడు మాతృభూమిమీద కాలు పెట్టిన విజయ్ భక్తిలో వీసమెత్తు భాగం చెక్కుచెదరలేదు. శారద శనివారం భక్తురాలు. ఆమెకు శనివారమంటే ఎక్కడలేని భయం.... ఆ రాత్రి హాస్టల్లో మంచి కూర.... తన కిష్టమైనది చేశారంటే చాలు, తింటున్నవాళ్ళని, వండిన నాయర్లను, వడ్డించే వారిని తిట్టుకుంటూ, బయటనుండి తెప్పించుకున్న ఉప్మాతిని, మంచినీళ్ళు తాగి కలలో కూడా శనివారాన్ని తిట్టేది....! ఒక రకంగా శారదను మెచ్చుకోవాలి. ఎలాంటి జిహ్వాచాపల్యం లేనివాళ్ళు శనివారం ఉపవాసం చెయ్యడంలో గొప్పలేదు. తినాలని గాఢమైన కోరిక ఉండీ పాపం దేవుని పేరిట తన కోరికలను పక్కకు నెట్టుతోందంటే, అది భక్తికాని.... భయంకాని.... విశ్వాసంకాని, శ్లాఘించదగ్గదే. ఇకపోతే పెద్దవాళ్ళు.... వాళ్ళ భక్తిని గురించి వర్ణించడానికి మాటలు చాలవు. చల్లటి గాలి తాకిడికి ఆమె ఊహల సరం తెగిపోయింది. ఎయిర్ కూలర్ బాగా పనిచేస్తోంది గర్భగుడిలో.

పగిలే టెంకాయలు... వెలిగే హారతులు.... వినిపించే మంత్రాల రణగొణ ధ్వనులు.... రొచ్చు, రొదా ఏదీ లేదు. ఉన్నతంగా ఉన్న భగవంతుని ముందు నిలబడ్డ క్షణంసేపు నిశ్శబ్దంగా మనసులోనే ప్రార్థనలు నివేదించుకోవచ్చు.

గర్భగుడిలో ప్రవేశిస్తూనే, కోరికలకూ, సర్వావేదనలకూ, నివేదనలకూ అతీతమైన ప్రశాంతి... గుండెలనిండా భక్తి... చెయ్యెత్తి నమస్కరించాలనే ఒకే ఒక్క భావం ఆమెను చుట్టుముట్టి, అద్వితీయమైన పరవశంలో ముంచింది.

భగవాన్! నీ వైభోగంలో ఎంత మహిమ వుంది! నీకు పెట్టే ఖర్చులో ఎంత శాంతి ఉంది.

"జరగవమ్మా జరుగు మెడబట్టి గెంటించుకునేదాకా మీరింతే."

ప్రగాఢమైన ప్రశాంతతనుండి ఉలిక్కిపడి తేరుకుంది ద్వారకి. వస్తూ వస్తూ గడప దగ్గర సాష్టాంగపడిన ఒక భక్తురాలిని కర్రతో తడుతూ తిడుతున్నాడు ఒక దఫేదారు. ఆమె ఆనందం కర్పూరంలా కరిగిపోయింది. వెనక్కైనా తిరిగి చూడకుండా గబగబా వచ్చేసింది.

"మరీ ఒక్క నిమిషమయినా నిలబడి చూడనీరు" గర్భగుడిలోనుంచి ఇవతల పడ్డాక విచారంగా అంది శారద.

"గత్యంతరం లేదు, పాపాయ్. ఇంత క్యూ జరగాలంటే మరో మార్గం లేదు."

విజయ్ మాటలతో ఏకీభవిస్తూ హాస్య ధోరణిలో అంది ద్వారకి...

"అదే మంచిది శారదా. లేకపోతే నీలాంటి భక్తురాళ్ళంతా మొక్కే మొక్కులు, కోరే వరాలు వినలేక ఆకాశరాజు అల్లుడు చెవిటివాడై పోగలడు."

"అయ్యో.... అయ్యో.... అవేం మాటలమ్మాయ్.... అపరాధం తల్లీ."

చెంపలేసుకుంటున్న వర్ధనమ్మను వారిస్తూ, "నేను అనగానే అంత మహిమ గల దేవుడు చెవిటివాడై పోతాడా, అమ్మమ్మా" అని ఏదో గుర్తు వచ్చినట్టు నిరంజనం గారివైపు తిరుగుతూ అంది ద్వారకి.

"అయితే బాబాయ్, ఇంత మంది కోర్కెలను, పరస్పర విరుద్ధమైన వాటిని తీర్చాలంటే పాపం.... పద్మావతీ విభుడు చిక్కుల్లో పడతాడే...."

ఆయన ఆప్యాయంగా నవ్వి పూరుకున్నారు. విజయ్ అందుకున్నాడు.

"తప్పదు, ద్వారకీ.... లంచాలు తీసుకున్నప్పుడు పరిష్కారం చూపించక తప్పదు. అంత బాధ్యత లేనివాడు కాదు మా స్వామి."

"మీ స్వామా? గుత్తకు తీసుకున్నావేమిటి విజయ్" అని నవ్వి వెంటనే విచారంగా అంది ద్వారకి.

"ఒక్క విషయం నువ్వు మరిచిపోతున్నావు విజయ్, లంచాలివ్వలేనివాళ్ళు కూడా ఉంటారు. అది నువ్వు ఒప్పుకోవాలి."

"ఆయన అల్ప సంతోషి ద్వారకీ.... ఆపదమొక్కులవాడికి ఆ నీలాలు చాలు."

పకపక నవ్వింది ద్వారకి.

"అయితే ఆపద వచ్చినవాడు మొక్కుకుంటే కాని ఆ విషయం ఆయన చెవిదాకా వెళ్ళదా? అంత దయగలవాడు తన భక్తులకు అపదలు రాకుండా చేస్తే సరిపోలా?" అని ఆగింది.

"అవునులే. మనుష్యుల తత్వాలు అలాంటివే. ఆపదలు రాకపోతే మనకు దేవుడే గుర్తుకురాడు."

"ఆయన మహిమను అనుమానించకు తల్లీ! ఇంటింట ప్రత్యక్ష నిదర్శనా లున్నాయి." అంతవరకు మౌనంగా ఉన్న రావుగారు వుండబట్టలేక అన్నారు.

"లేదు బాబాయ్, ఆయన శక్తిని అంచనా వేయడానికి నేనెంతటిదాన్ని?" పెదవులమీద చిరునవ్వున్నా మాటల్లో నిండుతనం లోపించడం చూచిన శారద ఆమెను ఉత్తేజపరిచే ఉద్దేశంతో మాట మార్చింది.

"వోయ్ గుడ్డిపిల్లా జాగ్రత్త. నీ కళ్ళజోడు కోతెత్తుకుపోగలదు."

* * * * *

"అమ్మో! వెయ్యి రూపాయిలే!! నాకిచ్చెయ్ బాబాయ్, మీ స్వామి పేరు చెప్పుకుని నాలుగు పట్టుచీరలు కొనుక్కుంటాను.

గుడిచుట్టూ ప్రదక్షిణంచేసి వచ్చి చెయ్యెత్తు హుండీ ఎదురుగా నిలబడి నోట్లు లెక్కపెడుతున్న నిరంజనరావు దగ్గర చేరి మారాం చెయ్యసాగింది ద్వారకి.

"నీకు నేను కొనిస్తాలేమ్మా."

"అహఁ అది కాదు బాబాయ్. అంత డబ్బు, ఆ గంగాళంలో పడేస్తుంటే, నాకు ప్రాణం ఒప్పడం లేదు బాబాయ్."

"అలా అనుకోవడం దోషమమ్మా. అది మొక్కుబడీ డబ్బు. శారద చిన్నపిల్లగా ఉన్నప్పుడు పెద్ద జబ్బు చేసింది. అప్పుడు మీ పిన్ని మొక్కుకుంది."

"అయితే, ఇంతవరకు ఆ మొక్కుబడి తీర్చకపోతే మీ దేముడికి కోపం రాదా బాబాయ్."

"జీవితంలో ఎప్పుడయినా చెల్లించవచ్చంటారు." నవ్వారాయన.

"ఆఁ భలే ఐడియా బాబాయ్. దేవుడు నోరు లేనివాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే వడ్డీతో సహా రాబట్టుకునేవాడు" గలగల నవ్వింది ద్వారకి.

శారద అందుకుంది. "అయ్యో గట్టిగా అనకే తల్లీ. దేవుడు వినగలడు. తరువాత కొత్త రెగ్యులేషన్స్ అంటూ రూల్సు మార్చేయగలడు."

వీళ్ళ సంభాషణని మౌనంగా, శ్రద్ధగా వింటున్న విజయ్ రావుగారివైపు తిరుగుతూ అన్నాడు.

"రూలంటే గుర్తొచ్చింది నాన్నారూ! మీరు మొక్కుకున్న డబ్బు ఎవ్వరికైనా పంచి పెట్టొచ్చు. దారి ఖర్చులకు కూడా వాడుకోవచ్చు. తిరిగి తీసికెళ్ళకుండా ఆయన హుండీలో ఒక్కపైస వేసినా చాలు."

"శభాష్. దేముడంటే అలా ఉండాలి. సప్తగిరి చక్రవర్తి మంచి లిబరల్ పర్సనాలిటీ లాగుందే" అని హుండీలో డబ్బు వేయడానికి ఒక్క అడుగు ముందుకేసిన రావుగారిని ఆపుతూ మరలా అంది.

"విజయ్ చెప్పింది చాలా చక్కగా ఉంది బాబాయ్. ఆ డబ్బు తలా కాస్త కొండమీద బిచ్చగాళ్ళకు పంచిపెట్టేయండి. మీ పేరు చెప్పుకుని, జీవితంలో తీరకుండా మిగిలిపోయిన కోర్కెలేమయినా వుంటే తీర్చుకుంటారు పాపం."

ఆయన నవ్వుతూనే తల అడ్డంగా తిప్పారు.

"లేదమ్మా, మీ పిన్ని హుండీలో వేస్తాననే మొక్కుకుంది."

"దేవుడు ఏమనుకోడులే బాబాయ్. అంతగా అయితే భగవంతుని కోర్టులో మీ తరపున నేను వకాల్తా పుచ్చుకుంటాను."

"దేముడి డబ్బేమీ దుర్వినియోగం కావడంలేదు కదమ్మా. ఆ శ్రీనివాసుని ఆస్తే లేకపోతే తిరుపతిలో యూనివర్శిటీ వెలిసేదా?"

"అవుననుకో బాబాయ్, అందరూ అంతో ఇంతో తినగా మిగిలిన డబ్బుతో మంచి పనులు చేస్తున్నారు... నేనూ ఒప్పుకుంటాను. కానీ బ్లాకమనీ లక్షలు లక్షలు ఆయన దోసిట్లో రాలుతున్నప్పుడు... కష్టార్జితం మన వెయ్యిరూపాయలు ఆయన జమ పుస్తకంలో ఏ మూల ఇరుక్కుపోతాయో..... లేదు బాబాయ్, అన్యాయంగా వెయ్యి రూపాయలు వృధా చెయ్యొద్దు మీరు."

హుండీచుట్టూ జనం క్షణక్షణానికి పెరిగిపోతున్నారు. ఇక తప్పించుకోవడానికి వీలు లేకపోయిందాయనకు. అప్పటికి తనలో వున్న అనుమానాన్ని బయటపెట్టారు.

"నా స్నేహితుడొకాయన ఇలాగే మొక్కుకుని, వాళ్ళ మాటలు, వీళ్ళ మాటలు విని తలా కాస్తా పంచి, మిగిలిందేదో వేసి ఇంటికి తిరిగొచ్చేసరికి పెళ్ళికెదిగిన కొడుకు కారు ఏక్సిడెంట్‌లో పోయాడు."

ఉలిక్కిపడింది ద్వారకి.

"భగవంతుణ్ణి మరీ అంత కర్కోటకుడిగా చిత్రించకండి బాబాయ్. భగవంతుడు దీనులకు అభయహస్తమిచ్చే సౌజన్యమూర్తి కావాలి. కానీ, తన కివ్వాల్సిన బాకీ తీర్చ లేదని నిండు ప్రాణాన్ని బలి తీసుకునేంత స్వార్థపరుడా? అదే నిజమయితే అలాంటి భగవంతుడికి రెండు చేతులెత్తి నమస్కరించడానికి సిగ్గు పడాలి."

ఆమె ఆవేశాన్ని మధ్యలోనే ఆపుతూ అన్నారాయన.

"ఏదోలేమ్మా మన మనస్సులు లెక్కలేనన్ని అనుమానాలతో, పిరికిగా ఆలోచిస్తుంటాయి. అన్నిటినీ ఆయనకెందుకులేమ్మా ఆపాదించడం?.... ఏదో.... ఎవరి భయాలు వాళ్ళకుంటాయి."

నిట్టూర్చింది ద్వారకి. "మనకి దేవుడిమీద భక్తికంటే భయమెక్కువనిపిస్తుంది బాబాయ్."

అయన చాలాసేపు మౌనంగా వుండిపోయారు. ఆ పిల్ల యనాలసిస్‌లో కొంత నిజమున్నట్టు అయనకీ అనిపిస్తోంది.

అంతవరకు ఒక ప్రక్కగా కూర్చుని అలసట తీర్చుకుంటున్న వర్ధనమ్మ రావడంతో టాపిక్ పుణ్యతీర్థాలలోకి మళ్ళింది. ఈ మధ్యలో వెయ్యి రూపాయలు హుండీలో వేసి వచ్చారాయన. ఈమారు ఆయనకు అడ్డుపడలేదు ద్వారకి.

* * * * *

"అరె, పెద్దమ్మా నువ్వెప్పుడొచ్చావు?" తీరిగ్గా స్తంభాల మేడలోకొచ్చి కూర్చుని ప్రసాదం తింటున్న ద్వారకి పెద్దగా వినవచ్చిన శబ్దానికి వెనక్కు తిరిగింది. చంకలో చంటాడితో ఒక యువతి ఒక నడివయస్కురాలికి ఎదురునడుస్తూ పరామర్శిస్తోంది ఆనందంగా. ఆమె పట్టుచీర గాలిలో రెపరెపలాడుతోంది.

"అదేంటి పెద్దమ్మా, బొత్తిగా కమ్మలయినా పెట్టుకోకుండా వచ్చావు?"

"ఇప్పుడే నిలువుదోపిడీ ఇచ్చి వస్తున్నానే పంకజం."

"అయ్యో, చంటిదానికి విరేచనాలయినప్పుడు మ్రొక్కుకున్నదేనా? అయినా పెద్దమ్మా ఏ తోమాలసేవో, ఉయ్యాలసేవో మొక్కుకోకపోయావటే?"

ద్వారకితోపాటు వింటున్న అందరికీ ఆ సంభాషణ చాలా ఆసక్తికరంగా వుంది.

"పోనీ తలా ఒక నగ ఇవ్వలేకపోయావా పెద్దమ్మా, ఏ ఉంగరమో మిగిలింది హుండీలో వేస్తే పోయేదిగా!" పెద్దమ్మ కళ్ళింత చేసుకుంది.

"ఏమిటేమిటీ? అలా కూడా ఇవ్వచ్చా? అయ్యో! అయ్యో! కాసింత ముందయినా చెప్పావు కాదే పంకజం. మీ కమలక్క, అనసూయక్క, అలివేలుతో పాటు నీకూ ఒకటి యిద్దును గదా!"

ఈ విషయం తనకెవరూ చెప్పక తనని ఇంత నష్టంలో ముంచినందుకు పెద్దమ్మ బాధపడుతుంటే.... కాస్త ముందుగా చెప్పింటే తనకీ అంతో ఇంతో ముట్టుండేదని పంకజం వాపోతోంది. ప్రసాదాలు భోంచేయడం అయ్యాక లేస్తుంటే శారద అమ్మను ఎవరో పలకరించారు.

"నువ్వా సత్యా, ఎప్పుడొచ్చావు? శోభకు నీలాలివ్వడానికి తీసుకొచ్చావా?"

"లేదు ఆంటీ. అప్పుడేదో దిక్కుతోచక మా అమ్మ మొక్కేసింది. చూస్తూ చూస్తూ పెళ్ళికెదిగొస్తున్న పిల్ల బారెడు జడ ఎలా ఇవ్వను... చెప్పు? అపరాధంగా ఓ నూట పదహార్లు వేసి ఐదు కత్తిరింపులిప్పించి వస్తున్నాను."

సత్య, శారద అమ్మతోపాటు అంతా ధ్వజస్తంభం దాటుకుని, టెంకాయనీళ్ళ చితచితలో జాగ్రత్తగా నడుస్తున్నారు.

రహస్యంగా అంది ద్వారకి.

"మొత్తానికి దేవుడు భక్తులకు మంచి ఛాయిస్ ఇచ్చాడే, శారదా."

"ఉష్" వారించింది శారద.

"మా పాపాయికి దేవుడు వినేస్తాడని భయం" అని నవ్వాడు విజయ్.

* * * * *

"నిన్న గుడికి రాకపోతివే ఈ రోజు బయలుదేరుతున్నావేం?"

"భలేదానివే. మొక్కుబడి గుండివ్వకుండా గుడిలోకెవరయినా వస్తారేంటి చిన్నక్కా?" ద్వారకి అమాయకత్వానికి పన్నెండేళ్ళ ప్రసాద్‌కు ఆశ్చర్యంగా ఉంది.

కళ్యాణకట్ట కళ్ళకింపుగా, చూడముచ్చటగా వుంది. పెరిగిన గడ్డాలు, పెంచు కున్న జుట్లు, నిడుపాటి జడలు మొదటి స్టేజీ అయితే, అర్ధపింగళాలు, పసిపిల్లల

ఏడుపులు మధ్యస్టేజి అయితే, నిగనిగలాడే గుండ్లు, మూలనున్న నీలాలగుట్టలు అఖరిస్టేజి. కళ్యాకట్ట దాటాక ప్రసాద్ నున్నటి గుండును చూస్తూ అంది ద్వారకి.

"టిక్కెట్టు కొన్నావు కదా. మరలా రెండు రూపాయలెందుకిచ్చావు చిన్నా?"

"భలేదానివే అక్కా. ఆ ముడుపు చెల్లించకపోతే ఈ వరకు నా గుండునిండా ఎర్రటి ముగ్గులుండేవి" అని పకపక నవ్వాడు.

బంగారు తొడుగుతో మెరిసిపోయే దిగుడుమెట్లతో అందంగా మెరిసిపోయే కోనేరు.... అందులో పావనమైన భక్తిభావంతో పులకితమైన స్వచ్ఛమైన నీరు... మనసులో మనోహరంగా ఊహిస్తున్న బంగారు కోనేరు కళ్ళెదుట కనిపించగానే ఒక్క క్షణం స్తంభించి తేరుకుంది ద్వారకి.

"అక్కా, చల్లుకో, చల్లుకో. తిరువతోదకం, తిరువతోదకం" నున్నటి గుండుతో గబగబ పైకివచ్చి తలా కాస్తా చల్లేశాడు ప్రసాద్. తలపైపడిన తడిని కంపరంగా తుడుచుకుని చుట్టూ కలియచూచింది ద్వారకి. పాచిపట్టిన గోడలు, మురికి అల్లుకుపోయిన మెట్లు... దానిచుట్టూ విచ్చలవిడిగా కాలకృత్యాలు తీర్చుకుంటున్న జనం... వాళ్ళ మధ్యగా ప్రగాఢమైన భక్తితో శిరస్సుదాకా మునిగిపోయి, అదే నీటిని నోటి నిండా తీసుకుని ప్రక్షాళనం చేసుకుని పునీతమైపోయినట్లు భావిస్తున్న భక్తులు... ద్వారకి శరీరంలోని రోమ రోమం అసహ్యంతో జలదరించిపోయింది.

"అక్కా, పదిపైసల నా నామాలు ఎట్లున్నాయి?" అంటూ ఉషారుగా వచ్చి ప్రసాద్ తనని కుదిపేవరకు ఈ లోకంలోకి రాలేకపోయింది ద్వారకి.

* * * * *

శంఖుమిట్ట కాలనీలో కాటేజ్ కారిడార్ తాలూకు పిట్టగోడమీద కూర్చుని చదువుకుంటున్న పుస్తకాలలోనుండి విసుగ్గా తలెత్తింది ద్వారకి. ఎదురుగుండా అంత ఎత్తులో రంగు బల్బులతో వజ్రాలతో మెరుస్తున్న శంఖు, చక్రం, మధ్యలో వెంకటేశుని నామాలు దివ్యసుందరంగా, అద్భుతంగా వున్నాయి. క్షణకాలం మెరుపులా మనసును పారవశ్యం చుట్టుముట్టింది. క్షణాలు గడిచేకొద్దీ ఆ పారవశ్యం వెనుక ఏదో వెలితి.... తనని పొద్దుటినుండీ మానసికంగా బలహీనురాల్ని చేస్తున్న ఆ వెలితి ఎక్కడుంది?

అనుకోకుండా ఈనాడు దివ్యమంగళ స్వరూపుని దర్శనం కలిగింది. దోవ పొడుగునా రమ్యసుందర ప్రకృతిని చూడగలిగింది. చంద్రగిరి మెట్లకు దగ్గరగా దేవుని పేరిట పెంచబడిన తోటా, ఆ తోటనిండా విరిసిన రోజాపుష్పాలూ తనని పరవశంలో ముంచాయి. ఇకపోతే, తనీనాడు కలసి ప్రయాణం చేసిన మనుషులు పూర్తిగా

పరిచితులు కాకపోయినా, అపరిచితులేం కాదు. సన్నిహితురాలూ, స్నేహితురాలూ అయిన శారద, సహృదయుడూ, స్నేహపాత్రుడూ అయిన విజయ్, అక్కా అని వరస కలిపి ఆప్యాయంగా పిలిచే ప్రసాద్, తనని ఆత్మీయంగా చూస్తున్న అమ్మ, అమ్మమ్మ బాబాయ్.... వీళ్ళెవరివల్లా తన మనసులో వెలితి కలిగే అవకాశం లేదు. పోతే, మానసికంగా తను పొందలేనిదేమీ లేదు. వీళ్ళు పొందుతున్న ఆనందాన్ని చూసి ఈర్ష్యపడడానికి... అయితే .... అయితే, ఈ వెలితి, ఈ అసంతృప్తి, ఈ అశాంతి, వీటి స్వరూపం తనలో ఎందుకు ముద్రవేసుకుంది? చాలా అపురూపంగా, అందమైన స్మృతి చిహ్నంగా దాచుకోవాలనుకున్న ఈ ప్రయాణంలో ఈ అపశ్రుతి ఎక్కడుంది? విచారంగా చూపు మరల్చుకొన్న ఆమెకు ఎదురుగుండా కుర్చీలో కూర్చుని తననే తదేకంగా, పరిశీలనగా చూస్తున్న విజయ్ లోతైన చూపులు దర్శనమిచ్చాయి.

ఆమెకు అంతరాంతరాల్లో, తన వెలితికి కారణం ఎక్కడో కొద్దికొద్దిగా గ్రహింపు కొస్తోంది. కాని దాని తాలూకు సమగ్ర స్వరూపాన్ని సంపూర్ణంగా తెలుసుకోవడానికి గజిబిజిగా వున్న ఆమె మేధ చాలడం లేదు. దానిని అధిగమిస్తే కాని ఆమెకు ఈ అవస్థ నుండి విముక్తి కలిగేట్టు లేదు. అలాంటి దశలో విజయ్ చూపులు ఆమెకు కొంత ఆధారమిచ్చాయి.

కుర్చీలోనుండి లేచి రెండడుగులు ముందుకువేసి "నీకేమయింది. అలా వున్నావు?" అని అడిగిన విజయ్‌తో ఎలాంటి సంకోచం లేకుండా చెప్పింది ద్వారక.

"నాకీ రోజెందుకో చాలా విచారంగా ఉంది విజయ్."

ఆమెకు జవాబు విజయ్ చెప్పలేదు కాని, అక్కడే కూర్చుని చిక్కుడు కాయలు వలుస్తున్న వర్ధనమ్మ అందుకుంది చటుక్కున.

"అదేమిటమ్మడూ! ఈ రోజుకంటే పుణ్యదినం మరొకటుంటుందా? సర్వేశ్వరుడి పాదాలముందు కూర్చుని అలాంటి మాటలనచ్చా?"

ఆ కాటేజీల మధ్యగా విశాలమైన రోడ్డు వెంబడి నడిచిపోతున్న అందమైన జంట అమ్మమ్మ మాటలకు ఇటు తిరిగి, వెంటనే తల తిప్పుకుని చెయ్యీ చెయ్యీ పట్టుకుని వెళ్ళిపోయింది.

"భగవంతుణ్ణి మనం నమ్మాలే కాని, ఎక్కడ లేడు అమ్మమ్మా?"

"అదేమిటే అమ్మాయ్, అదో దారి. ఇదో దారి. ఆ శంఖు చూడు ఆ చక్రం చూడు కళ్ళు పావనమయిపోయాయంటే నమ్ము."

"నిజమే, ఈ దివ్యమంగళస్వరూపాన్ని, ఆ వైభవాన్ని చూస్తుంటే తన ఒళ్ళంతా

జలదరించి, ఒకలాంటి అనుభూతి కలిగినమాట వాస్తవమే కానీ.... కానీ తనలోని వెలితి ఈ వెలితి....."

లోపలనుండి ముసలమ్మకు పిలుపు రావడంతో, ఆమెకు జవాబు చెప్పే క్లిష్ట పరిస్థితినుండి తప్పించుకుంది ద్వారకి. అంతవరకు ఆమె ముఖంలో తారాడుతున్న నిస్తేజమూ, వేదనాపూరితమూ, అశాంతిమయమూ అయిన భావాలను గమనిస్తున్న విజయ్ తన కంఠం సవరించుకుని సానుభూతిగా అన్నాడు.

"లాభంలేదు, ద్వారకీ నువ్వు మరీ అంత సెన్సిటివ్‌గా వుండకూడదు. సంఘంలో జరిగే అన్ని మోసాలతోపాటు ఇదీ ఒకటని సరిపెట్టుకోవాలి. భగవంతుణ్ణి చూడడమే మన ధ్యేయంగా పెట్టుకోవాలి కాని, మన మనస్సును పరిసరాలమీదకు వదిలేస్తే మిగిలేది... పరిష్కారం దొరకని సమస్యే అవుతుంది."

అతను అలా చెపుతున్నప్పుడు ఆమెకు గుడిదగ్గర తాము/చెప్పకుండానే చెప్పులు జాగ్రత్త చేశానని తగవులాడి రూపాయి ఇవ్వందే కాళ్ళు వదలని ముక్కుపచ్చలారని పసివాళ్ళ మోసపు ప్రథమసోపానం... గుడి వెలుపల వద్దన్నా వినకుండా నాలుగు గజాల దూరం సూట్‌కేసు మోసి రూపాయిన్నర డిమాండ్ చేస్తున్న కూలీలు.... కళ్యాణ కట్టలో తమ నైపుణ్యాన్ని చూపి అదనంగా కొన్ని రూపాయలు మూట కట్టుకుంటున్న వాడూ.... ప్రక్కవాడి జేబులో మాయమయిపోయిన పర్సూ... కొబ్బరికాయ దగ్గరనుండి సవరాలు దాకా జరగుతున్న బేరాల తేడాలు... ఇంకా కళ్ళున్న గుడ్డివాళ్ళూ, కాళ్ళున్న కుంటివాళ్ళూ చేస్తున్న వ్యాపారాలు ఆమె మస్తిష్కంలో మెదలాడాయి. ఆమె కనుపాపలు అసహనంగా చలించాయి.

"కాదు విజయ్. ఇవన్నీ భక్తిపేరిట ఈ పావనమైన కొండమీద జరుగుతున్న మోసాలు... మరెక్కడో కాదు భగవంతుని పాదాలముందు భక్తులు ఎదుర్కొంటున్న దోపిడీలు. ఊహుఁ ..... ప్రతిచోట జరిగే మోసాలలాగ దీనినీ అంగీకరించడానికి నా మనస్సు వ్యతిరేకిస్తోంది...." ఆగింది ద్వారకి.

విజయ్ మాట్లాడలేదు. ఆమె మానసిక అవస్థ అర్థమయినట్లు చూస్తున్నాడు.

"నా కీ క్షణంలో భగవంతుని ఉనికిమీదే నమ్మకం పోతోంది విజయ్! అయన కొరకు కొన్ని పందల మైళ్ళు వెనక్కు నెట్టి ముందుకొస్తున్న భక్తులకు, రకరకాల శ్రమలకోర్చి ఆయన దర్శనం కొరకు ప్రాకులాడుతున్న భక్తులకు ఆయనిచ్చే స్వాగతమా ఇది? ఆయన పాదధూళితో పావనమైన ఈ శిఖరంమీద జరగాల్సిన మోసాలా ఇవి?... ఇంతమంది ప్రజలలో తన ఉనికిమీద నమ్మకం కలిగించిన ఈ దేవునిచుట్టూ వున్న నాలుగు గజాల స్థలంలో కూడా అన్యాయమేనా?" ఆమె ఆవేశం ఆమెకు ఆయాసాన్నందించింది.

"ప్రశాంతంగా, నిర్భీతిగా నాలుగు క్షణాలు గడపడానికి భగవంతునిచుట్టూ నాలుగు గజాల చోటైనా దొరుకుతుందనుకున్నాను......" అతను సానుభూతిగా ఆమెవైపు చూస్తున్నాడు.

"ఇంకొకటి విజయ్, ఈ పుస్తకం చదివి చూడు. దీనిని పూర్తిగా చదివితే అతి సామాన్యుడైన మానవుడికి... లేని మహాశక్తుల్ని అంటగట్టి, భగవంతుడిని అన్యాయంగా మనమే గద్దెనెక్కించామేమో ననిపిస్తుంది. ఆ భావం కలగగానే పుస్తకం మూసేసి కూర్చున్నాను. లేకపోతే విష్ణుమూర్తి లక్ష్మీదేవిని వెతుక్కుంటూ కొండలమ్మట నెత్తురు కారుకుంటూ రావడమేమిటి?.... తన ఆవు ఎవరికో పాలు ఇచ్చిందనే కోపంతో గొల్లవాడు ఆవును కొట్టబోతే ఆ గొల్లవాడిని అన్యాయంగా విష్ణువు శపించడమేమిటి?.... ఆకాశ రాజు పుత్రికకొరకు సామాన్య మానవుడిలా ఆ విరహాలేమిటి?.... తనని కొల్చినవాడికి మోక్షప్రాప్తి... లేకపోతే నరకప్రాప్తి. వాడెంత సద్గుణుడైనా సరే! ఛీ.... ఛీ! చాలా చీప్‌గా వున్నాయి ఈ పుస్తకాలు."

ఒక చల్లటి పిల్ల తెమ్మెర మల్లెల వాసన మోసుకుంటూ వాళ్ళమీదుగా వెళ్ళిపోయింది. ఆమె దానిని ఆస్వాదించే దశలో లేదు.

"ద్వారకీ! అవన్నీ కట్టుకథలు... నువ్వు నమ్మకు. భగవంతుడనే పేరు మీద మనల్ని నడిపించే శక్తి ఏదో వుందని మాత్రం విశ్వసించు. పాపభీతివల్ల అవినీతినుండి వెనక్కి వెళ్ళడానికి ఆయుధమైన దైవశక్తిపట్ల చేతులు జోడించు."

భగవంతునిమీద నమ్మకంతో ఒకప్రక్క, ఆయనచుట్టూ జరుగుతున్న మోసాల మీద జుగుప్సతో ఒకప్రక్క చలించిపోయి చెబుతున్న అతని జవాబు ద్వారకికి కొంత ఉపశాంతినిచ్చింది.

* * * * *

ఆ మర్నాడు తిరిగి వెళ్తూ అనుకుంది ద్వారకి.

'ఈ ప్రయాణం చెయ్యకుండా వుండాల్సింది. నా అందమైన కల చెరిగిపోయేది కాదు.'